# నవతరం

నేటితరం కోసం...

హైదరాబాద్ | ఆదివారం, జనవరి 25, 2026 | సంపుటి:11 | సంచిక :268 | పేజీలు: 4 | వెల : రూ.5




**సింగరేణిలో టెండర్ నిబంధనల మార్పు**

::: ఉత్పత్తి ఆలస్యం వల్ల భారీ ఆర్థిక నష్టం: కిషన్‌రెడ్డి



## భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది: ప్రధాని మోదీ

**ప్రపంచంలో అత్యధిక యువత మన దేశంలోనే ఉందన్న ప్రధాని**

**యువతకు అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్న మోదీ**

**వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాల ద్వారా విదేశాల్లోని భారత యువతకు అవకాశాలు లభిస్తాయని వెల్లడి**

భారతదేశం సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశం మనదని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 45 ప్రదేశాల్లో 18వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశం సంస్కరణల దిశగా ముందుకు సాగుతోందని, ఇందుకోసం వివిధ దేశాలతో వాణిజ్య, మొబిలిటీ రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని తెలిపారు. తద్వారా భారతీయ యువతకు ప్రభుత్వం అనేక అవకాశాలను సృష్టిస్తోందని ఆయన అన్నారు. యువతకు ఉద్యోగం లక్ష్యంగా ప్రారంభమైన రోజ్‌గార్ మేళా కార్యక్రమం ఇప్పుడు ఒక సంస్థగా రూపాంతరం చెందిందని అన్నారు. రోజ్‌గార్ వేదికగా దేశంలోని లక్షలాది మంది ఉద్యోగాలు పొందారని ఆయన వెల్లడించారు. యువతకు సరైన, సమగ్ర అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు. వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని, దీని ద్వారా దేశ, విదేశాల్లో ఉన్న భారతీయ యువతకు విస్తృత అవకాశాలు లభిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

## నా మిత్రుడు అనునిత్యం నగరి కోసం తపించేవారు: సీఎం చంద్రబాబు



**కుప్పం తరహాలో నగరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని సీఎం హామీ**

**2029 నాటికి నగరికి కృష్ణా జలాలు తీసుకువస్తానని వెల్లడి**

**స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరిలో సీఎం చంద్రబాబు పర్యటన**

**రాష్ట్రవ్యాప్త సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులకు శంకుస్థాపన**

**వలసలు నివారించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని స్పష్టీకరణ**

చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గాన్ని తన సొంత నియోజకవర్గమైన కుప్పం తరహాలో అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. 2029 ఎన్నికల నాటికి నగరికి కృష్ణా జలాలను తీసుకొచ్చి సాగు, తాగునీటి కష్టాలు తీర్చే బాధ్యత తనదని ఆయన స్పష్టం చేశారు. స్థానిక యువత ఉపాధి కోసం వలసలు వెళ్లకుండా పరిశ్రమలను తీసుకొస్తామని భరోసా ఇచ్చారు. శనివారం నగరిలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ అభివృద్ధిపై కీలక హామీలు ఇచ్చారు. నగరితో తనకున్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, "నగరి తెలుగుదేశం పార్టీకి కంచుకోట. నా మిత్రుడు, దివంగత నేత గాలి ముద్దుకృష్ణమ నాయుడు ఈ ప్రాంత ప్రజల కోసం నిరంతరం తపించేవారు. గడిచిన ఐదేళ్లలో ఇక్కడ అభివృద్ధి ఆగిపోయింది. ఇప్పుడు మళ్లీ మంచి రోజులు మొదలయ్యాయి" అని వ్యాఖ్యానించారు. పేదల అభ్యున్నతి కోసం చేపట్టిన పీ4 (పేదరికంపై గెలుపు) కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకొచ్చిన మార్గదర్శులను కూడా సీఎం సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ నాయుడు, ఎంపీ డి.ప్రసాదరావు తదితర నేతలు, అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. వ్యర్థాల సేకరణ కోసం రూపొందించిన 'స్వచ్ఛ రథాల'ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ప్రజా వేదిక వద్ద ఏర్పాటు చేసిన మెప్మా, డ్వాక్రా మహిళల ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించి వారిని అభినందించారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను కొనియాడుతూ పలువురిని సన్మానించారు. "స్వచ్ఛాంధ్ర అనేది కేవలం

(మిగతా 2వ పేజీలో)



## టీ-హబ్ స్టార్టప్ కేంద్రంగానే కొనసాగాలి

**ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయింపుపై సీఎం రేవంత్ ఆక్షేపణ**

**ఇంక్యుబేషన్, ఇన్నోవేషన్‌కు మాత్రమే టీ-హబ్ వినియోగం**

**అమెరికా పర్యటనలో నుంచే సీఎస్‌తో సమీక్ష**

**అద్దె భవనాల్లోని ఆఫీసులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్న ఆదేశం**

హైదరాబాద్, జనవరి 25: టీ-హబ్‌ను పూర్తిస్థాయిలో స్టార్టప్ కేంద్రంగానే కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. టీ-హబ్‌లో సబ్‌రిజిస్ట్రార్, వాణిజ్య పన్నుల శాఖ డివిజన్ కార్యాలయాలకు స్థలం కేటాయించాలన్న ప్రతిపాదనలపై ఆయన స్పష్టమైన అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం శనివారం ఈ అంశంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో ఫోన్‌లో మాట్లాడారు. స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్, ఇన్నోవేషన్‌కు ఉత్సాహం కల్పించే లక్ష్యంతో ఏర్పాటైన టీ-హబ్‌లో ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ఎలాంటి స్థల కేటాయింపులు ఉండకూడదని

(మిగతా 2వ పేజీలో)

## సింగరేణిపై విషపురాతలు.. ఎవరి కోసం?: భట్టి విక్రమార్క

**ఎవరికి లబ్ది చేకూర్చడానికో ప్రజలకు తెలియాలన్న ఉపముఖ్యమంత్రి**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటనను స్వాగతిస్తున్నట్లు వెల్లడి**

**రాబందుల నుంచి సింగరేణి ఆస్తులను కాపాడతానని ప్రకటన**

సింగరేణి ఆస్తులను కొంతమందికి కట్టబెట్టే ప్లాన్ తో, కార్మికుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా విషపు రాతలు రాస్తున్నారంటూ తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషపు రాతల వల్ల రాష్ట్రానికి, సింగరేణికి నష్టం వాటిల్లుతోందని ఆరోపించారు. ఈ మేరకు ఈరోజు ఉదయం ప్రజాభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. సింగరేణిపై అసత్య ప్రచారాల వెనక కుట్ర దాగి ఉందని, సింగరేణి ఆస్తులు కాజేసే ప్లాన్ ఉందని ఆరోపించారు. టెండర్లపై అపోహలు సృష్టించేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఎవరి ప్రయోజనాల కోసం తప్పుడు రాతలు రాస్తున్నారో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రాబందుల నుంచి సింగరేణి ఆస్తులను కాపాడతానని ఆయన చెప్పారు. నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల వ్యవహారంపై బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్ రావు లేఖ

(మిగతా 2వ పేజీలో)





## నాంపల్లి ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం

**గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి నాలుగో అంతస్తుకు వ్యాపించిన మంటలు**

**రోబో ఫైర్ మిషన్ ద్వారా మంటలు ఆర్పుతున్న సిబ్బంది**

**ఎనిమిది ఫైరింజన్లతో మంటలను ఆర్పుతున్న సిబ్బంది**

నాంపల్లిలోని ఓ ఫర్నీచర్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. బచ్చా క్యాజిల్ ఫర్నిచర్ దుకాణంలో మంటలు చెలరేగి నాలుగో అంతస్తు వరకు వ్యాపించాయి. ప్రమాదం మొదట గ్రౌండ్ ఫ్లోర్‌లో సంభవించి, ఆపై నాలుగు అంతస్తులకు విస్తరించింది. రోబో ఫైర్ మిషన్ ద్వారా అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఘటనా స్థలానికి భారీ క్రేన్లు చేరుకున్నాయి. భవనం లోపల ఇద్దరు చిన్నారులు, నలుగురు పెద్దలు చిక్కుకున్నట్లు సిబ్బంది గుర్తించారు. స్కైలాడర్ ద్వారా నాలుగో అంతస్తు అద్దాలను పగులగొట్టి వారిని రక్షించేందుకు ప్రయత్నాలు

(మిగతా 2వ పేజీలో)



## భారత్, ఇరాన్ బంధంపై ఖమేనీ ప్రతినిధి కీలక వ్యాఖ్యలు

**ఇరుదేశాల మధ్య బంధం వందల ఏళ్ల నాటిదన్న అబ్దుల్ మాజిద్**

**ఇరాన్, భారత్ మధ్య సంబంధాలు, సహకారం ఉండాలని ఖమేనీ కోరుకుంటున్నారని వ్యాఖ్య**

**తాము కూడా గణితం, ఖగోళశాస్త్రం, వైద్య విద్యను చదువుతున్నామని వెల్లడి**

## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ... ఇద్దరు మావోలు అరెస్ట్

**దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ మెంబర్ సొల్మన్, భార్య అరెస్ట్**

**అచ్చంపేటకు వచ్చిన మావోయిస్టు దంపతులు**

**అరెస్ట్ చేసిన నాగర్‌కర్నూలు పోలీసులు**



# భారత్, ఇరాన్ బంధంపై ఖమేనీ ప్రతినిధి కీలక వ్యాఖ్యలు

**ఇరుదేశాల మధ్య బంధం వందల ఏళ్ల నాటిదన్న అబ్దుల్ మాజిద్**

**ఇరాన్, భారత్ మధ్య సంబంధాలు, సహకారం ఉండాలని ఖమేనీ కోరుకుంటున్నారని వ్యాఖ్య**

**తాము కూడా గణితం, ఖగోళశాస్త్రం, వైద్య విద్యను చదువుతున్నామని వెల్లడి**



భారతదేశం, ఇరాన్‌ల సంబంధాలపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ప్రతినిధి అబ్దుల్ మాజిద్ హకీమ్ ఇలాహీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారతదేశానికి చెందిన ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, ఇరుదేశాల మధ్య బంధం వందల ఏళ్ల నాటిదని అన్నారు. భారత్ భాగస్వామిగా ఉన్న చాబహార్ పోర్టు పురోగతిపై ఆయన పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇరాన్, భారత్ మధ్య మంచి సంబంధాలు, సహకారం ఉండాలని ఇరాన్ సుప్రీం లీడర్ కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. ఇతర దేశాల ఆంక్షల వల్ల భారత్ ఎప్పుడూ ప్రభావితం కాలేదని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య సంబంధాలు మూడువేల ఏళ్ల నాటివని గుర్తు చేశారు. ఆ సమయంలో భారతదేశానికి చెందిన తాత్విక పుస్తకాలు ఉపయోగించేవాళ్లమని అన్నారు. ప్రస్తుతం తమ విశ్వవిద్యాలయాల్లో కూడా గణితం, ఖగోళశాస్త్రం, వైద్య విద్యను చదువుతున్నామని అన్నారు. కొన్ని అంతర్జాతీయ సంస్థలు ఇరాన్‌పై ఆంక్షలు విధించడంతో పాటు అణు కేంద్రాలపై నిఘా పెట్టి ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయని ఆరోపించారు. ఇదిలా ఉండగా, ఇరాన్‌లో ఇటీవల నిరసనలను విమర్శిస్తూ ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి అత్యవసర సమావేశంలో ప్రవేశపెట్టిన తీర్మానానికి భారత్ వ్యతిరేకంగా ఓటు వేసింది. దీనిపై భారత్‌లోని ఇరాన్ రాయబారి మహ్మద్ పథాలి స్పందిస్తూ, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

# ధరణి లొసుగులతో ప్రభుత్వ భూముల దోపిడీ

**సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్‌లో అక్రమాల వెలుగు**

**రిజిస్ట్రేషన్ చలానా సొమ్ము దారిమళ్లింపుపై 48 మందిపై కేసులు**

**పైలట్ నివేదిక తర్వాత 31 జిల్లాల్లోనూ ఆడిట్‌కు నిర్ణయం**

**ఎవరి పాత్ర ఎంతన్నదానిపై లోతైన విచారణకు ఆదేశం: మంత్రి పొంగులేటి**



హైదరాబాద్, జనవరి 25: ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని గత ప్రభుత్వంలోని కీలక వ్యక్తులు ప్రభుత్వ భూములను కాజేశారని, పోర్టల్‌లోని లొసుగులను ఉపయోగించి రిజిస్ట్రేషన్ల చలానా సొమ్మును దారిమళ్లించారని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. అక్రమాల్లో పాల్గొన్న వారందరి బాగోతాలను బయటపెడతామని, ఎవరికీ మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు. సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ ద్వారా పైలట్ ప్రాజెక్టు కింద నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో అనేక అవినీతి లావాదేవీలు వెలుగులోకి వచ్చాయని మంత్రి తెలిపారు. ప్రాథమిక నివేదిక పరిశీలన పూర్తయిన అనంతరం మిగిలిన 31 జిల్లాల్లోనూ ఇదే తరహా ఆడిట్ చేపడతామని వెల్లడించారు. సాగుభూముల రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో చలానా సొమ్ము దారిమళ్లింపు వ్యవహారంపై ఏర్పాటు చేసిన హైలెవల్ కమిటీ సభ్యులతో శనివారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంటెలిజెన్స్ అదనపు డీజీ విజయ్‌కుమార్, కమిటీ సభ్యులు అనిశా ఎస్పీ సింధు శర్మ, సీఎమ్మార్వో ప్రాజెక్టు డైరెక్టర్ మంద మకరందు, రిజిస్ట్రేషన్ల డీఐజీ ఎం.సుభాషిణి, సైబర్ క్రైమ్ డీఎస్పీ ఎ.సంపత్, ఎన్ఐసీ ప్రతినిధి శ్రీనివాస్, హోంశాఖ సలహాదారు పి.శరత్‌కుమార్ పాల్గొన్నారు. రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్‌గాంధీ హనుమంతు కూడా హాజరయ్యారు. ధరణి పోర్టల్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు సుమారు 35 లక్షల లావాదేవీలు జరిగినట్లు హైలెవల్ కమిటీ మంత్రికి నివేదించింది. ప్రాథమికంగా 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు గుర్తించామని, 1,109 దస్తావేజులకు సంబంధించి సుమారు రూ.4 కోట్లు దారిమళ్లినట్లు వెల్లడించింది. ఈ అక్రమాల్లో ఎవరి పాత్ర ఎంత ఉందన్నదానిపై, తెరవెనుక ఎవరైనా ఉన్నారా?, రెవెన్యూ అధికారుల ప్రమేయం ఉందా? అనే అంశాలపై మంత్రి కమిటీ సభ్యులను వివరంగా ఆరా తీశారు. ప్రాథమిక నివేదికను పరిశీలించిన మంత్రి, మరింత లోతైన విచారణ చేపట్టి తుది నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే 9 జిల్లాల్లోని 35 మండలాల్లో అక్రమాలకు పాల్పడిన 48 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ, ముందుచూపు లేకుండా ధరణి పోర్టల్‌ను తీసుకురావడం వల్లే ఈ అక్రమాలకు ఆస్కారం ఏర్పడిందన్నారు. భూభారతి పోర్టల్ సాంకేతికత ద్వారా ఆడిట్ నిర్వహించి తప్పిదాలను గుర్తించామని చెప్పారు. వాస్తవాలు ఇలా ఉంటే ప్రతిపక్ష నేతలు రూ.వెయ్యి కోట్లు, రూ.పది వేల కోట్ల అవినీతి అంటూ బాధ్యతారాహిత్యంగా వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర శాఖ నూతన డైరీని మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వి.విక్టర్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందించిన పొంగులేటి, సీఎం రేవంత్‌రెడ్డిపై ఆయన మాట్లాడుతున్న భాష సరికాదని తీవ్రంగా వ్యాఖ్యానించారు.

# సింగరేణిలో టెండర్ నిబంధనల మార్పు

**ఉత్పత్తి ఆలస్యం వల్ల భారీ ఆర్థిక నష్టం: కిషన్‌రెడ్డి**



కొత్తగూడెం, జనవరి 24 : సింగరేణి సంస్థలో టెండర్ విధానాలకు సంబంధించి నిబంధనలను మార్చనున్నట్లు కేంద్రమంత్రి, బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. సెల్ఫ్ డిక్లరేషన్ సర్టిఫికెట్ లేకపోతే జియో ట్యాగింగ్ ద్వారా సైట్ విజిట్ చేసినట్టు నిరూపించేలా రెండు విధాలుగా నిబంధనలు రూపొందించవచ్చని ఆయన తెలిపారు. సింగరేణిలో తప్పకుండా నూతన సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కోల్‌బెల్ట్ పర్యటనలో భాగంగా శనివారం కొత్తగూడెంలోని సింగరేణి ఇల్లెందు అతిథి గృహంలో అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించిన అనంతరం కిషన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. సైట్ విజిట్ తప్పనిసరి నిబంధనగా ఉండాలని, ఆ సర్టిఫికెట్‌ను సింగరేణి యాజమాన్యమే జారీ చేయాలని అన్నారు. కోల్ ఇండియాలో కూడా ఇదే విధానం అమలులో ఉందని పేర్కొన్నారు. కొన్ని కంపెనీలు ఏసీ గదుల్లో కూర్చొని భూమి పరిస్థితులు, అడవులు, గుట్టలు, నదులు, రోడ్డు మార్గాలు, విద్యుత్ సౌకర్యాలు వంటి అంశాలను పరిశీలించకుండా టెండర్లు వేస్తున్నాయని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఫలితంగా టెండర్ దక్కిన తర్వాత పనులు ఆలస్యమై, మూడు నుంచి ఐదేళ్లలో పూర్తవాల్సిన ఉత్పత్తి పదేళ్లయినా జరగకపోవడం వల్ల దేశానికి భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతోందన్నారు. సింగరేణి ఖర్చును ఏ విధంగా తగ్గించుకోవచ్చన్న అంశంపై ఆరు నెలల క్రితమే కేంద్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసి నివేదికను సింగరేణి యాజమాన్యానికి అందజేసిందని తెలిపారు. ఆ నివేదిక ఆధారంగా తీసుకున్న నిర్ణయాలను అధికారులు తనకు వివరించారని చెప్పారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సింగరేణిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సింగరేణికి జెన్‌కో నుంచి పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్నాయని, ఈ విషయంపై ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని కిషన్‌రెడ్డి తెలిపారు. కోల్ ఇండియా, సింగరేణి సంస్థల లాభాలను కేంద్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వినియోగించుకోవడం లేదని, ఆయా సంస్థల అభివృద్ధికే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. సింగరేణికి కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ద్వారా బొగ్గు నిక్షేపాలపై అన్వేషణ చేపట్టి, నూతన ప్రాజెక్టుల ఏర్పాటుకు కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు. సింగరేణిలో కొత్త ఉద్యోగుల భవిష్యత్ కోసం నూతన గనులు ప్రారంభించాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# అమెరికాలో మంచు తుపాను

**16 రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ, 8,000 విమానాలు రద్దు!**



అమెరికా చరిత్రలోనే అత్యంత తీవ్రమైన మంచు తుపానుల్లో ఒకటి దేశాన్ని అతలాకుతలం చేస్తోంది. టెక్సాస్ నుంచి న్యూ ఇంగ్లాండ్ వరకు సుమారు 2,000 మైళ్ల విస్తీర్ణంలో ఈ తుపాను ప్రభావం చూపుతుండటంతో అగ్రరాజ్యం గజగజ వణికిపోతోంది. దాదాపు 20 కోట్ల మందికి పైగా ప్రజలు శీతల వాతావరణం, మంచు హెచ్చరికల నీడలో జీవిస్తున్నారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాషింగ్టన్ డీసీతో పాటు అలబామా, జార్జియా, కెంటకీ, న్యూయార్క్, టెక్సాస్ సహా 16కు పైగా రాష్ట్రాలు ఇప్పటికే 'స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ'ని ప్రకటించాయి. ఆర్కిటిక్ ప్రాంతం నుంచి పోలార్ వోర్టెక్స్ కారణంగా దూసుకొస్తున్న అతి శీతల గాలులు, శక్తివంతమైన తుపాను వ్యవస్థతో కలవడంతో ఈ విపత్కర పరిస్థితి ఏర్పడింది. దీని ఫలితంగా దేశంలోని తూర్పు భాగమంతా భారీ హిమపాతం, గడ్డకట్టే వర్షం (ఫ్రీజింగ్ రెయిన్), స్లీట్ (మంచుతో కూడిన వర్షం)తో అల్లకల్లోలంగా మారింది. ముఖ్యంగా సదరన్ ప్లెయిన్స్, లోయర్ మిసిసిపీ వ్యాలీ, టెన్నెస్సీ వ్యాలీ, ఆగ్నేయ రాష్ట్రాల్లో కొన్నిచోట్ల "విపత్తు స్థాయి"లో మంచు పేరుకుపోయే ప్రమాదం ఉందని జాతీయ వాతావరణ సేవల విభాగం (ఎన్‌డబ్ల్యూఎస్) హెచ్చరించింది. "ఇది చాలా తీవ్రమైన తుపాను" అని యూఎస్ వెదర్ ప్రిడిక్షన్ సెంటర్ వాతావరణ శాస్త్రవేత్త జాకబ్ ఆషర్‌మాన్ అభివర్ణించారు. ఈ మంచు తుపాను కారణంగా దేశవ్యాప్తంగా జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. విమాన ప్రయాణాలపై తీవ్ర ప్రభావం పడింది. ఫ్లైట్ అవేర్ డేటా ప్రకారం, ఈ వారాంతంలో (శని, ఆదివారాలు) ఇప్పటివరకు 8,000కు పైగా విమానాలను రద్దు చేశారు. డెల్టా, అమెరికన్, యునైటెడ్ ఎయిర్‌లైన్స్ వంటి ప్రధాన సంస్థలు ప్రయాణ హెచ్చరికలు జారీ చేసి, టికెట్ మార్పు రుసుములను రద్దు చేశాయి. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) కూడా టెక్సాస్ నుంచి ఈశాన్య రాష్ట్రాల వరకు పలు విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నిలిచిపోవచ్చని హెచ్చరించింది. మంచు ప్రభావం కేవలం ప్రయాణాలకే పరిమితం కాలేదు. గడ్డకట్టే వర్షం కారణంగా విద్యుత్ తీగలపై అంగుళం మందం వరకు మంచు పేరుకుపోయే ప్రమాదం ఉంది. దీనివల్ల విద్యుత్ లైన్లు తెగిపోయి, చెట్లు కూలిపోయి సుదీర్ఘకాలం పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెక్సాస్‌లో ఇప్పటికే దాదాపు 20,000 మంది, ఓక్లహోమా, ఆర్కాన్సాస్‌లలో వేలాది మంది విద్యుత్ లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. 2021 నాటి విద్యుత్ సంక్షోభం నుంచి పాఠాలు నేర్చుకున్నామని, ఈసారి విద్యుత్ గ్రిడ్‌ను సిద్ధంగా ఉంచామని టెక్సాస్ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఫెడరల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఫెమా) దాదాపు 30 సహాయక బృందాలను సిద్ధంగా ఉంచింది. ఆహారం, దుప్పట్లు, జనరేటర్లను కీలక ప్రాంతాలకు తరలించింది. పలు రాష్ట్రాల్లో నేషనల్ గార్డ్ దళాలను మోహరించారు. వాషింగ్టన్ డీసీ మేయర్ మురియల్ బౌజర్ మాట్లాడుతూ, "మేము అధికారికంగా స్నో ఎమర్జెన్సీ, స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీని ప్రకటించాం" అని తెలిపారు. చికాగోలో పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, లూసియానాలో కార్నివాల్ పరేడ్‌లు, నాష్‌విల్లేలో పలు కార్యక్రమాలు రద్దయ్యాయి.



## నాంపల్లి ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం

జరుగుతున్నాయి. భవనం పరిసర ప్రాంతాల ప్రజలను అధికారులు ఖాళీ చేయించారు. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడుతుండటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ఫర్నిచర్ దుకాణంలోని సెల్లార్‌లో ఫర్నిచర్ నిల్వ ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. ఎనిమిది ఫైరింజన్లతో మంటలను ఆర్పుతున్నారు. అగ్ని ప్రమాద ప్రాంతంలో పోలీసులు, హైడ్రా సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందం సహాయక చర్యలు చేపట్టారు. ఘటనా స్థలంలో అంబులెన్సులు అందుబాటులో ఉంచారు. ప్రమాద తీవ్రతను పెంచే వస్తువులను అక్కడి నుంచి తరలించారు.

## నా మిత్రుడు అనునిత్యం నగరి కోసం తపించేవారు: సీఎం చంద్రబాబు

ప్రభుత్వ కార్యక్రమం కాదు, అది మనందరి జీవన విధానం కావాలి. ఏడాది క్రితం ఒక ఉద్యమంలా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ప్రతి నెలా మూడో శనివారం నేతలు, అధికారులు పాల్గొంటున్నారు. ప్రజలంతా భాగస్వాములైతేనే దీని లక్ష్యం నెరవేరుతుంది" అని పిలుపునిచ్చారు. సమైక్యాంధ్రలో సీఎంగా ఉన్నప్పుడు తాను ప్రారంభించిన జన్మభూమి, పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమాలను ఆయన గుర్తుచేశారు.

## సింగరేణిపై విషపురాతలు.. ఎవరి కోసం?: భట్టి విక్రమార్క

రాయడాన్ని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచారణ జరిపిస్తానని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణిపై కిషన్ రెడ్డి పరిశీలిస్తేనే నిజాలు బయటపడతాయని చెప్పారు.

**2018లోనే సైట్ విజిట్ నిబంధన..**

కోల్ ఇండియా టెండర్ డాక్యుమెంట్ ను కేంద్ర ప్రభుత్వం 2018లో తయారు చేసిందని, అప్పుడే సైట్ విజిట్ తప్పనిసరి అనే నిబంధన పెట్టిందని భట్టి విక్రమార్క చెప్పారు. 2021లో కేంద్ర గనుల శాఖ కూడా సైట్ విజిట్ తప్పనిసరి అని చెప్పిందన్నారు. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం లేదని, బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉందని ఆయన గుర్తుచేశారు. గత డాక్యుమెంట్లలోని నిబంధనల ఆధారంగానే ఇటీవల సింగరేణి టెండర్లు పిలిచిందని చెప్పారు. అయితే, మేమే ఈ నిబంధన పెట్టినట్లు పత్రికలు, నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సోషల్ మీడియాలో కూడా ఇష్టానుసారం ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ... ఇద్దరు మావోలు అరెస్ట్

**దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ మెంబర్ సాల్మన్, ఆయన భార్య అరెస్ట్**

**అచ్చంపేటకు వచ్చిన మావోయిస్టు దంపతులు**

**అరెస్ట్ చేసిన నాగర్ కర్నూలు పోలీసులు**

ఇప్పటికే వరుస ఎన్ కౌంటర్లు, లొంగుబాట్లతో భారీగా దెబ్బతిన్న మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్, మిలిటరీ ఇన్ స్ట్రక్టర్ మీసాల సాల్మన్ అలియాస్ సంతోశ్ నాగరాజు, డీవీసీఎం అయిన ఆయన భార్యను నాగర్ కర్నూలు పోలీసులు అరెస్ట్ చేశారు. అచ్చంపేటకు వచ్చిన వీరు... మావోయిస్టు ఫ్రంట్ సంస్థల నేతల సాయంతో మావోయిస్టు కార్యకలాపాలను తిరిగి పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరితో పాటు మహబూబ్ నగర్, నల్లమల ప్రాంతాల్లో మావోయిస్టులకు సహకరిస్తూ, వారికి ఆశ్రయం కల్పిస్తున్న మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో సివిల్ లిబర్టీస్ కమిటీ జాయింట్ సెక్రటరీ జక్క బాలయ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్ కో-కన్వీనర్ ఎడ్ల అంబయ్య, మంశెట్టి యాదయ్య ఉన్నారు. ఎర్టిగా కారులో మన్ననూరు నుంచి అచ్చంపేటకు వెళుతున్న సమయంలో వీరిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

## టీ-హబ్ స్టార్టప్ కేంద్రంగానే కొనసాగాలి



సీఎం స్పష్టం చేశారు. అలాంటి ప్రతిపాదనలు ఉంటే వెంటనే విరమించుకోవాలని అధికారులకు సూచించారు. టీ-హబ్ ఉద్దేశానికి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అద్దె భవనాల్లో పనిచేస్తున్న కార్యాలయాలను అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాలకు తరలించాలని సీఎం సూచించారు. టీ-హబ్‌ను ప్రత్యామ్నాయంగా వినియోగించాలన్న ఆలోచన సరైంది కాదని పేర్కొన్నారు. అయితే టీ-హబ్‌లో కొన్ని విభాగాల్లో ప్రస్తుతం స్థలం ఖాళీగా ఉండటంతో అక్కడ ఇతర ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలన్న ఆలోచన అధికారులు చేసినట్టు సమాచారం. సాధారణంగా టీ-హబ్‌లో స్థాపితమయ్యే స్టార్టప్‌లు తమ ఆవిష్కరణలు కార్యరూపం దాల్చిన తర్వాత సొంత కార్యాలయాలకు మారుతుండగా, అదే సమయంలో కొత్త స్టార్టప్‌లు ప్రవేశిస్తుంటాయి. ఈ కారణంగా కొన్ని సందర్భాల్లో తాత్కాలికంగా ఖాళీ స్థలం ఏర్పడుతున్నట్టు అధికారులు వివరించారు. అయితే ఖాళీగా ఉందన్న కారణంతో ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాన్ని కేటాయిస్తే టీ-హబ్ యొక్క మూల లక్ష్యం దెబ్బతింటుందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. స్టార్టప్‌లకు నిరంతరంగా అవకాశాలు కల్పించే కేంద్రంగా టీ-హబ్‌ను కొనసాగించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా సీఎం స్పష్టంగా పేర్కొన్నారు.

# ముప్వల నగేష్ హత్య కేసును సిబిఐకి అప్పగించాలి



**600 రోజులు దాటినా గాని మత్స్యకార విద్యార్థి కుటుంబానికి న్యాయం జరగలేదు**

**అధికారంలోకి వస్తే ద వంద రోజుల్లో న్యాయం చేస్తామన్న నారా లోకేష్ ఎక్కడ?**

**శివాని ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యంపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు**

**పోలీసులపై నమ్మకం లేకనే సిబిఐ విచారణ కు డిమాండ్**

**కాశీబుగ్గ బస్టాండ్ వద్ద గాంధీ విగ్రహం ముందు ముప్వ నగేష్ కుటుంబ సభ్యులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టిన న్యాయవాది దువ్వాడ శ్రీధర్( బాబా)**

**స్తంభించిన ట్రాఫిక్.. పలాసలో నెలకొన్న ఉద్రిక్తత**

**నిరసన కార్యక్రమానికి తరలివచ్చిన నువ్వల రేవు మత్స్యకారులు**

**రంగ ప్రవేశం చేసిన పోలీసులు.. సినీ ఫక్కీలో దువ్వాడ శ్రీధర్ ( బాబా) ను అరెస్టు చేసిన పోలీసులు**

**పోలీసులు వాహనాన్ని అడ్డుకున్న మత్స్యకారులు.. ఎట్టికేలకు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ కు దువ్వాడ శ్రీధర్ తరలింపు**

( పలాస) : మత్స్య సామాజిక వర్గానికి చెందిన ముప్వల నగేష్ మరణించి దాదాపు 600 రోజులు గడిచినప్పటికీ ఇంతవరకు ఆ ఘటనపై ప్రభుత్వం స్పందించక పోవడం పట్ల నిరసనగా ప్రముఖ న్యాయవాది దువ్వాడ శ్రీధర్ ( బాబా) నేతృత్వంలో శనివారం కాశీబుగ్గ లో గల మహాత్మా గాంధీ విగ్రహం ముందు మృతుడి కుటుంబ సభ్యులతో పాటు నువ్వల రేవు గ్రామస్తులతో కలిసి ఆకస్మిక నిరసన కార్యక్రమం చేపట్టారు. వందలాదిమంది మత్స్యకారులు ప్లే కార్డులు చేపట్టి .. శివాని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ముప్వల నగేష్ మృతిపై సిబిఐ విచారణ చేపట్టాలంటూ.. చనిపోయిన కుటుంబానికి ఆదుకోవాలంటూ , వారంతా ముక్తకంఠంతో నినాదాలు చేశారు. ఒక దశలో మూడు రోడ్ల కూడలి నుంచి పలాస వైపు వెళ్లేందుకు ట్రాఫిక్ స్తంభించిపోయింది. శాంతియుతంగా కొనసాగిన ఈ నిరసన కార్యక్రమం కొనసాగినంతసేపు పలాసలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సందర్భంగా న్యాయవాది దువ్వాడ శ్రీధర్ ( బాబా) ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ముప్వల నగేష్ అనే ఇంజనీరింగ్ విద్యార్థి ఎచ్చెర్ల లోని శివాని ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతుండగా, అనూహ్యంగా మరణించాడని, అందుకు ఎంతవరకు ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం స్పష్టమైన సమాధానం చెప్పలేదని, గడచిన ఎన్నికలలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ వ్యవహారంపై మాట్లాడుతూ, తాము అధికారులకు వస్తే వంద రోజులలో విచారణ చేపట్టి న్యాయం చేస్తామంటూ హామీ ఇచ్చారని దువ్వాడ శ్రీధర్ గుర్తు చేశారు కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చి దాదాపు రెండేళ్లు అవుతున్న గాని ఇచ్చిన మాట నారా లోకేష్ తో పాటు జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా మత్స్యకారుడైన ముప్వల నగేష్ కుటుంబానికి న్యాయం చేయలేకపోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నిరుపేద మత్స్యకారులైన ముప్వల నగేష్ తల్లిదండ్రులు కటిక పేదరికం అనుభవిస్తున్నారని, నగేష్ చనిపోయి దాదాపు 600 రోజులు కావస్తున్న గాని ఇంతవరకు ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదని, ప్రస్తుతం మృతుడి కుటుంబం వీధిన పడిందని , ఇంతవరకు ఈ కేసు ఎటువంటి పురోగతి సాధించలేదని, స్థానిక పోలీసులపై నమ్మకం లేకపోవడం వల్లే తాము సిబిఐ విచారణ కోరుతున్నామని దువ్వాడ శ్రీధర్ డిమాండ్ చేశారు. మృతుడు నగేష్ కుటుంబానికి న్యాయం జరిగే వరకూ వారికి అండగా నిలిచి శాంతియుతంగా పోరాటం చేస్తామని, తక్షణం శివాని ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యంపై చర్య తీసుకోవడమే కాక , ఈ ఘటనకు బాధ్యులైన వారిని అరెస్ట్ చేయాలని, అలాగే బాధిత మత్స్యకార కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక దశలో నిరసన కార్యక్రమం కొనసాగుతుండగా కాశీబుగ్గ పోలీసులు రంగ ప్రవేశం చేసి ఎటువంటి అనుమతి లేకుండా నిరసన కార్యక్రమం చేపట్టడం నేరమని, తక్షణం ఈ నిరసన కార్యక్రమాన్ని విరమించాలంటూ పోలీసులు హుకుం జారీ చేశారు. దాంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. నాటకీయ పక్కిలో దువ్వాడ శ్రీధర్ కు అరెస్ట్ చేయడానికి బలవంతంగా పోలీసులు పోలీస్ వాహనం ఎక్కిస్తుండగా, నిరసన కార్యక్రమం చేపట్టిన మత్స్యకారులు వాహనాన్ని చుట్టుముట్టి బైఠాయించారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడే ఉండి నిరసన చేస్తామంటూ మత్స్యకారులు ' పోలీసులు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. చాలాసేపు మత్స్యకారులకు పోలీసులు మధ్య వాగ్వివాదం జరిగింది. ఎట్టి కేల కు పోలీస్ అధికారులు దువ్వాడ శ్రీధర్ తో ఫోన్లో మాట్లాడిన తర్వాత ఆయన్ని కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ కు తరలించారు. నిరసనకారులు కూడా స్వచ్ఛందంగా పోలీస్ స్టేషన్ కి తరలి వెళ్లారు. తమకు న్యాయం జరగాలంటూ .. తమ తరఫున న్యాయ పోరాటం చేస్తున్న దువ్వాడ శ్రీధర్ ను పోలీసులు బలవంతంగా తీసుకువెళ్లి అరెస్టు చేయడం సబబు కాదని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మత్స్యకారుడైన ముప్వల నగేష్ కుటుంబానికి న్యాయం చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని వారంతా స్పష్టం చేశారు.



## క్రిస్టియన్ల సంక్షేమానికి కృషి

### ::: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్చెరువు నియోజకవర్గం నవతరం:- పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని క్రిస్టియన్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గం పరిధిలోని చర్చిల కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 10 లక్షల 80 వేల రూపాయల విలువైన చెక్కులను శనివారం సాయంత్రం ఆయా చర్చిల పాస్టర్లకు ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనివార్య కారణాల మూలంగా చెక్కుల పంపిణీ ఆలస్యం జరిగిందని తెలిపారు. రెండు విడతలలో మొత్తం 70 చర్చిలకు 21 లక్షల రూపాయలను అందచేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం నుండి మంజూరైన ప్రతి పైసాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, మెప్మ డిపిఓ స్వాతి, సిఓలు రేఖా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



## బొల్లారం సఫాయి కార్మికుల వేతనాల పట్టణ బిజెపి అధ్యక్షుడు కేజీఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి

బొల్లారం మున్సిపాలిటీ నవతరం :- బొల్లారంజీహెచ్ఎంసీ 272 డివిజన్ పరిధిలో పనిచేస్తున్న సఫాయి కార్మికుల మూడు నెలల వేతనాల సమస్య పరిష్కారమైంది. గత కొంతకాలంగా జీతాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కార్మికులు, తమ గోడును పట్టణ బిజెపి అధ్యక్షుడు కేజీఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి గారికి వివరించారు. కార్మికుల కష్టాలను చూసి చలించిన ఆనంద్ కృష్ణారెడ్డి గారు, వెంటనే బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి గారి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఎమ్మెల్సీ గారు సంబంధిత డిసి కమిషనర్‌తో మాట్లాడి వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. నాయకుల కృషితో జీతాలు మంజూరు కావడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.






## సరస్వతి పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్చెరువు నియోజకవర్గం నవతరం :- పటాన్చెరు నియోజకవర్గం లోని వసంత పంచమి పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని అంబేద్కర్ భవన్, ఆల్విన్ కాలనీ, ఇంద్రేశం మున్సిపల్ పరిధిలలో నిర్వహించిన సరస్వతి దేవి పూజ కార్యక్రమాలలో పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకర్షించాయి. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు బండి శంకర్, నారాయణ రెడ్డి, పృథ్వీ రాజ్, షకీల్, రామ్మోహన్, నవీన్ రెడ్డి, సత్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యులు రవి, చటర్జీ, మండల్, తదితరులు పాల్గొన్నారు.



## గుమ్మడిదల మున్సిపాలిటీలోని సేవా కార్యక్రమంలో దూసుకెళ్తున్న MNR

**అనుక్షణం సేవ కార్యక్రమంలో ఆపద్బాంధవుడుగా నేనున్నా అంటున్న MNR వ్యవస్థాపకుడు నరేందర్ రెడ్డి**

**మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటాను అంటూ**

**MNR వ్యవస్థాపకుడు మూడు చింతల నరేందర్ రెడ్డి**



గుమ్మడిదల మున్సిపాలిటీ నవతరం :- MNR యువసేన వ్యవస్థాపకుడు మూడు చింతల నరేందర్ రెడ్డి గారు అన్న అంటే నేనున్నానని ఎప్పుడు ఏ సమయంలోనైనా సాయానికి ముందుకు వచి ఆపత్కాలంలో అభాగ్యులకు, పేదలకు, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ సాయం చేస్తూ ఆదుకుంటున్నారు. గురువారం నాడు గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మున్సిపాలిటీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న తుడుం రాజమ్మ భర్త తుడుము నరసయ్య అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. ఆ కుటుంబానికి అండగా నిలిచి నేను ఉన్నానని ధైర్యం ఇచ్చి ఓదార్చారు.. ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.. ఆయనతోపాటు మాజీ సర్పంచులు ఇందెల సురేందర్ రెడ్డి, మండలి తులసిదాస్ మరియు ఆకుల ఆంజనేయులు, రామా గౌడ్, తుడుం శీను, రవీందర్ రెడ్డి, రాజిరెడ్డి, కర్ణాకర్, సంతోష్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, హరీష్, అజార్, అశోక్, యాదగిరి మహమ్మద్ నర్సింలు రమేష్, డప్పు శీను, సుధాకర్, సురేష్, సాయి, లింగం తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఆనిశ వలలో అవినీతి అసిస్టెంట్

### రూ.2 లక్షల లంచం తీసుకుంటూ తహసీల్దార్ కార్యాలయ ఏసీబీకి చిక్కిన సీనియర్ అసిస్టెంట్




ఆదిలాబాద్, జనవరి 23, నవతరం : ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కటకం విద్యాసాగర్ రెడ్డి తెలంగాణ అనిశా (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డాడు. ఫిర్యాదుదారుని పేరిట ఉన్న 8.35 ఎకరాల భూమికి సంబంధించిన సాదా బైనామా రిజిస్ట్రేషన్ దస్తావేజును ప్రాసెస్ చేసి పంపించేందుకు లంచం డిమాండ్ చేసిన విద్యాసాగర్ రెడ్డి, ఫిర్యాదుదారుని నుంచి రూ. 2,00,000/- లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే అనిశా అధికారులు వలపన్నించి ఈ దాడిని విజయవంతంగా నిర్వహించారు. ఈ ఘటనతో తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి కలకలం రేగింది. నిందితుడిపై కేసు నమోదు చేసి, తదుపరి విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

# గణతంత్ర దినోత్సవం మనందరి పండుగ



భారత దేశ ప్రభుత్వపరంగా జరుపుకునే పండగలలో స్వాతంత్ర్య దినంతో పాటు గణతంత్రదినోత్సవం ముఖ్యమైన పండగ. మనమంతా ఆ పండుగలో సంతోషంగా పాలుపంచుకోవాలి. మన అభివృద్ధే దేశ ప్రగతి, కనుక ప్రతి పౌరుడూ దేశాభివృద్ధిలో తన వంతు కర్తవ్యంగా, తను ఎంచుకున్న రంగాన్ని కృషితో అభివృద్ధి చేస్తూ,తన చుట్టూ వున్న సమాజాన్ని సంఘటిత పరుస్తూ ఉత్తమ జీవితాన్ని రానున్న గణ తంత్ర దినోత్సవ శుభ సమయంలో కొనసాగించాలి. ఈ సందర్భంగా దాని గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. భారతదేశంలో జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవం జరుపుకుంటాం. భారత రాజ్యాంగం జనవరి 26 1950 నుండి అమలులోకి వచ్చింది. మన రాజ్యాంగం మన అత్యున్నత చట్టం. 26 జనవరి 2026 వ తేదీన మనం గణతంత్ర దినోత్సవాన్ని జరపుకోబోతున్న శుభ తరుణంలో, దానికి సంబంధించిన చరిత్ర ఘట్టాలు తెలుసుకోవాల్సిన అవసరం, ముఖ్యంగా నేటి యువతరానికి అత్యంతావశ్యకం. 8 వ శతాబ్ది లో అరబ్ ల దండయాత్ర తో మొదలై, మొఘల్ రాజులలో ప్రముఖుడైన ఔరంగజేబు వారసులతో ముస్లిం రాజుల పాలన అంతమైంది.వ్యాపార నిమిత్తమై ఈస్టిండియా కంపెనీ రూపంలో వచ్చి,భారతదేశమంతా ఆక్రమించి, సుమారు 190 ఏళ్లు దమనకాండ తో సాగించిన బ్రిటీష్ వారి పాలనతో దేశం సర్వం నాశనమైంది. అంతకు ముందు ముస్లిం రాజుల కంటే రెట్టింపు దేశసంపద, వనరులూ సర్వం ఆంగ్లేయుల వలన దోచుకోబడి భారతదేశం నిరుపేద దేశంగా మిగిలింది. దీనంతటికీ ముఖ్య కారణం మనలో ఐక్యత లేక ఒకరికొకరు కీచులాడు కోవడం,సమైక్యత లోపించడం. చివరకు, ఆనాటి ప్రజలు,నాయకుల అందరి సమైక్యత కారణంగానే జరిగిన, సుమారు 90 ఏళ్ల ప్రజల అవిశ్రాంత స్వాతంత్ర పోరాటాల వలన, గాంధీ లాంటి అనేక మహాత్ముల త్యాగ ఫలితంగా,ఆత్మబలిదానాల వలన 1947 ఆగస్టు 15 వ తేదీన ఆంగ్లేయుల పాలన ముగిసి భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందింది. మన అత్యున్నత చట్టం రాజ్యాంగం 1950 జనవరి 26 నుంచి అమలు లోకి వచ్చింది. రాజ్యాంగ రూపకల్పన సభ్యులలో రాజ్యాంగ సభ అధ్యక్షుడుగా డాక్టర్ రాజేంద్ర ప్రసాద్,డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ గా బి.ఆర్. అంబేద్కర్, సలహాదారుగా సర్ బి.ఎన్.రావు, ఇంకా నెహ్రూ, వల్లభాయ్ పటేల్, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్,కె.యం.మున్షీ,టి.టి.కృష్ణమాచారి లాంటి ప్రముఖులు ఉన్నారు. వీరుగాక డ్రాఫ్టింగ్ కమిటీ సభ్యులుగా గోపాలస్వామి అయ్యంగార్,అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ కూడా ఉన్నారు. ఈ రాజ్యాంగం లో ప్రజల హక్కులు,బాధ్యతలు పరిపాలనకు సంబంధించినవన్నీ వివరంగా తెలుపబడ్డాయి. ఈ రాజ్యాంగాన్ని అన్ని ప్రాంతాల్లో గెలిచిన రాజకీయవేత్తలు,రాజనీతిశాస్త్రవేత్తలు నామినేట్ చేయబడిన రాజ్యాంగ నిపుణులు 1946 నుంచి 1949 దాకా పార్లమెంటు హాలులో సమావేశమై చర్చల ద్వారా రూపొందించారు. ఇది సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాసామ్య, గణతంత్ర రాజ్యంగా దేశపౌరులందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికగా ఏర్పడింది. రాజ్యాంగ రూపకల్పనలో బీఆర్ అంబేద్కర్ కీలకపాత్ర వహించారు. భారత రాజ్యాంగ రచనలో వివిధ దేశాలలోని ఉత్తమ రాజ్యాంగ విధానాలు తీసుకుని రూపొందించారు.ఇందులో పార్లమెంటరీ విధానం, ఏక పౌరసత్వ విధానం, సభాపతి పదవి నిర్ణయాలు బ్రిటన్ రాజ్యాంగం నుంచి స్వీకరించారు. ప్రాథమిక హక్కులు,అత్యున్నత న్యాయ స్థాన, న్యాయ సమీక్షా విధానాన్ని అమెరికా రాజ్యాంగం నుంచి గ్రహించారు. రాష్ట్రపతి ఎన్నిక,రాజ్యసభ సభ్యుల నియామకం, ఆదేశిక సూత్రాల విధానం ఐర్లాండ్ దేశం నుంచి తీసుకున్నారు. పౌరుల ప్రాథమిక విధులు రష్యా రాజ్యాంగం నుంచి, కేంద్ర రాష్ట్ర సంబంధాల విధానం కెనడా, అత్యవసర పరిస్థితి విధానం జర్మనీ రాజ్యాంగం నుండి తీసుకోవడం జరిగింది. అంత ఘన చరిత్ర కలిగిన మన దేశాభివృద్ధి ప్రస్తుతం వేగాన్ని అందుకుంటోంది. ఆర్థిక వృద్ధిలో గానీ, సాంకేతికంగా స్టార్ట్ ప్ లతో, నూతన ఆవిష్కరణల పరంగా కానీ, విద్య,ఆరోగ్య, జీవన ప్రమాణాల పెంపుదలలో గానీ,డిజిటల్ ఇండియా స్వీకరించడంలోనూ, సేవారంగ అభివృద్ధిలో, ఎగుమతుల్లో ముందంజలో ఉంది. ఇక ఎదురౌతున్న సవాళ్ల విషయంలో, 144 కోట్ల జనాభాతో ప్రపంచంలో మొదటి స్థానంలో వున్న మన దేశం తలసరి ఆదాయంలో వెనుకబడి, ఇంత అభివృద్ధి జరిగినా, అభివృద్ధి చెందుతున్న దేశంగానే మిగిలిపోయింది. ముఖ్యంగా పేదరికనిర్మూలన, ఆదాయ అసమానతలను తొలగించడానికి చాలా కృషి చేయాల్సి ఉంది. ఈ ఏడాది కొత్త ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే, 2026 జనవరి 26 తేదీన జరిగే సంబరాలలో 77 వ గణతంత్ర దినోత్సవ సభ, వందేమాతరం గీతం 150 సంవత్సరాల వేడుక, ఆత్మనిర్భర్ భారత్ అలరించనున్నాయి. స్వాతంత్ర్య మంత్రం గా వందేమాతరం, శ్రేయస్సు మంత్రంగా ఆత్మనిర్భర్ భారత్ ని థీమ్ గా కేంద్ర ప్రభుత్వం తీసుకుని ఆ విధంగా ఏర్పాట్లు భారీగా చేసున్నది. ముఖ్య విదేశ ప్రముఖులు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు అంటోనియో కోస్టా, కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ రానున్నారు. మొత్తం మీద మన సైనిక శక్తి, దేశ స్వావలంబన, అభివృద్ధి,సాంస్కృతిక వైవిధ్య అంశాల ప్రగతి ని ఆ రోజున ప్రదర్శించడం జరుగుతుంది. గణతంత్రదినోత్సవ వేడుకల్లో సంతోషంగా పాల్గొందాం.జై భారత్.

**- బూర్గుల రామకృష్ణసాయి**




# రక్తంతో వ్రాసిన రాజ్యాంగం!

అంటరానివాడని త్రోసిపుచ్చారుడ
ఎవరూ వెంటరానివాడని
ఒంటెలా ఒంటరివాడని ముద్ర వేశారుడ
అవమానాల అగ్నిలో ఆత్మను కాల్చారుడ
కానీఆ అగ్నే తపస్సైందిడ
ఆ ఒంటరితనమే జ్ఞానయాత్రైందిడ

అవమానాల బూడిదలోంచి
ఒక మహాగ్రంథం పుట్టిందిడ
అదేరక్తంతో వ్రాసిన రాజ్యాంగండ
అదేతల్లి భారతమాత ఋణం
తీర్చిన అమోఘ అక్షరయజ్ఞండ

సిరా చుక్కలతో కాదుడ
పుస్తకపు పుటలపై కాదుడ
తన సున్నితమైన
హృదయం నుంచి
ఊరిన రుధిరధారలతో
తన కలల భారతానికి
అక్షర రూపమిచ్చిన అపరమేధావిడ

మనకు స్వాతంత్ర్యం వచ్చి
ఎన్నో దశాబ్దాలు గడిచినాడ
నేటి పాలనకు దిక్సూచిగా నిలిచింది
ఆ అక్షరాల వెలుగుడ
ప్రతి పౌరుడికి
ఒక అజేయ రక్షణకవచమైంది
అంబేద్కర్ రాజ్యాంగండ

ప్రపంచం యుద్ధాల గర్జనతో
దద్దరిల్లిపోతున్న వేళడ
బాంబుల బీభత్సంలో
పసిపిల్లల నవ్వులు
నలిగిపోతున్న వేళడ
స్త్రీలు, వృద్ధులు రక్తపుటేరుల్లో
కొట్టుకుపోతున్న వేళడ
రాజ్యాధినేతల రాజ్యకాంక్షలు...
మానవత్వాన్ని మింగివేస్తున్న వేళడ

మన వేదభూమి మాత్రం
ఒక శాంతి సింధువై నిలిచిందిడ
దానికి మూలకారుడు
మానవహక్కుల శిల్పిడ
సమానత్వానికి సారథిడ
రాజ్యాంగ శిల్పాకారుడుడ
అమరజీవి...అందరి ఆత్మ బంధువు
డా. బాబాసాహెబ్ భీమ్రావ్ అంబేద్కర్

**(అందరికీ భారతదేశ సర్వసత్తాక, సామ్యవాద, ప్రజాస్వామ్య, లౌకిక గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు)**

రచన :
**కవిరత్న, సాహిత్య ధీర సహస్ర కవి భూషణ్ పోలయ్య కూకట్లపల్లి**
**అత్తాపూర్ హైదరాబాద్**



# వ్యవసాయ యాంత్రీకరణ పటాన్ చెరువు నియోజకవర్గంలోని 5 మండలాలకు

పటాన్ చెరువు నియోజకవర్గం నవతరం :- 1) పటాన్చెరు 2) గుమ్మడిదల 3) జిన్నారం 4) ఆర్.సి.పురం 5) అమీన్ పూర్ పటాన్చెరు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో 64 మంది రైతులకు రూ.28 లక్షల సబ్సిడీతో వ్యవసాయ యంత్రాల పంపిణీ జరిగింది. వ్యవసాయ యాంత్రీకరణ ఆధునిక వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యంత్రాలపై 40 శాతం సబ్సిడీ అందజేస్తోందని, ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. పటాన్చెరు నియోజకవర్గంలో వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో సబ్సిడీపై మంజూరైన వివిధ రకాల వ్యవసాయ యంత్రాలను శనివారం సాయంత్రం పటాన్చెరు వ్యవసాయం క్యాంప్ కార్యాలయంలో రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంప్రదాయ పద్ధతులతో సాగు చేయడం వల్ల దిగుబడి తక్కువగా ఉండి ఖర్చులు అధికమవుతున్నాయని తెలిపారు. కృత్రిమ మేధస్సుతో తయారైన యంత్రాల వినియోగం వల్ల సాగు ఖర్చులు తగ్గి ఉత్పత్తి పెరిగిందని అన్నారు. ప్రతి యంత్రంపై ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మొత్తం రూ.28 లక్షల విలువైన వ్యవసాయ యంత్రాలను సబ్సిడీతో 64 మంది రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీమతి మనోహర, వ్యవసాయ శాఖ అధికారులు శ్రీ రవీంద్రనాథ్ రెడ్డి జినారం, శ్రీ శ్రీనివాస్ గుమడిదల, శ్రీ శివకుమార్ పటాన్చెరు, శ్రీ



ప్రసాద్ ఆర్సీ పురం, ఏఈవోలు, బీటీఎం శ్రీమతి నీతి స్పందన, ఏటీఎం శ్రీమతి రోజా, ఆత్మ కమిటీ డైరెక్టర్లు శ్రీమతి బాలగౌని రోహిణి, శ్రీమతి చంద్రకళ, శ్రీమతి వసంత, శ్రీమతి.సౌందర్య, శ్రీ మన్నె రవీందర్, శ్రీ భిక్షపతి పల్లపు, శ్రీ కోడకంచ రాజు, శ్రీ నాగేశ్వరరావు కావలి, శ్రీ పట్నం శ్రీనివాస్, శ్రీ మొహమ్మద్ ఫైయాజ్ మరియు రైతులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధం

**సమర్ధవంతం గల ప్రభుత్వం ఎర్పాటు లో ఓటు కీలక భూమిక ,డబ్బు,ప్రలోభాలకు లోశీగకుండ నిర్భయంగా ఓటు వేయండి**

**భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్ఛార్జ్ ప్రిన్సిపాల్ హిమజ**

**జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రాజనీతి శాస్త్ర విభాగం వారి ఆధ్వర్యశీ లో మాక్ పోలింగ్ నిర్వహించి ఓటు హక్కు వినియోగము పైన అవగాహన సదస్సు**




నవతరం ఖమ్మం భద్రాద్రి : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన వజ్రాయుధమని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత గల పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్ఛార్జ్ ప్రిన్సిపాల్ హిమజ గారు అన్నారు. 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. రాజనీతి శాస్త్రం-ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యశీ లో రాజనీతి శాస్త్ర అధ్యాపకులు వాడే .వీరస్వామి అధ్యక్షతన ఎర్పాటు చెసిన జాతీయ ఓటర్ల దినోత్సవం కి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.దఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హిమజ మాట్లాడుతూ, మాక్ పోలింగ్ నిర్వహించి విద్యార్థులు ఓటు వినియోగము అవగాహన కార్యక్రమం నిర్వహించిన రాజకీయ శాస్త్ర విభాగం అభినందించి ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కుకు ఎంతో విలువ ఉందని, ఆ విలువను ప్రతి ఓటరు తెలుసుకొని తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఓటు హక్కుపై విస్తృత అవగాహన కల్పించడం ద్వారా సమర్థవంతమైన, బాధ్యతాయుతమైన పాలనను ఏర్పాటు చేసుకోవచ్చని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత గల యువత ఓటరుగా నమోదు చేసుకోని రాజకీయ ప్రక్రియ లో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి.ఓటర్లను ఎన్నికల ప్రక్రియలో విధిగా పాల్గొనేలా ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం జనవరి 25న దేశవ్యాప్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఓటు హక్కు కోసం గతంలో ఎన్నో త్యాగాలు, పోరాటాలు జరిగాయని, ఆ విలువను గుర్తించి అర్హత గల ప్రతినిధులను ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రతి ఓటరుపై ఉందని అన్నారు.ఎన్నికలు లో ప్రతి ఓటు విలువైనది అని ఎన్నికల్లో గెలుపు ఓటములు ప్రభావితం చుపుతాయి అని అన్నారు అనంతరం కళాశాల అధ్యాపకులు,విద్యార్థులతో భారతదేశ పౌరులమైన మేము ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో మన దేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల నిర్వహణను పరిరక్షిస్తామని, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం లో అధ్యాపకులు కిరణ్ కుమార్ ,సుధాకర్, బాలాజీ ,వేణుకృష్ణ, శ్రీనివాసరెడ్డి,భవానీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజయనగరంలో గోయాజ్ సిల్వర్ జ్యువెలరీ షోరూం ప్రారంభం

విజయనగరం, నవతరం : మన్నికైన నాణ్యత గల ఆభరణాల సంస్థ గోయాజ్ సిల్వర్ జ్యువెలరీ 21వ షోరూం విజయనగరం ఎంజీ రోడ్డులోని శనివారం ఉదయం ప్రారంభమైంది. దీనిని సినీనటి రితికా నాయక్ లాంఛనంగా ప్రారంభించారు. హీరోయిన్ను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆమెతో ఫొటోలు దిగేందుకు ఎగబడ్డారు. యువతులు అందంగా కనిపించేందుకు ఈ జ్యువెలరీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఈ షోరూంలో మంచి సిల్వర్ జ్యువెలరీ కలెక్షన్లు ఉన్నాయని సినీనటి రితికా నాయక్ అన్నారు. గోయాజ్ జ్యువెలరీ ఛైర్మన్ వేములూరి రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ గోయాజ్ స్టోర్ ప్రారంభం సందర్భంగా జనవరి 24 నుంచి ఫిబ్రవరి 15 వరకు అద్భుతమైన ఆఫర్లను గొప్ప ప్రారంభ ఆఫర్లతో అందిస్తున్నట్లు తెలిపారు. అతి తక్కువ కాలంలోనే ప్రజల మన్ననలు పొందిన ఏకైక సిల్వర్ జ్యువెలరీ స్టోర్ గోయాజ్ లో వెండి ఆభరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

**::: సందడి చేసిన సినీనటి రితికా నాయక్**







# బాలిక.. ఇప్పుడు ఏలిక!

తను ఉందని తెలిస్తే గర్భవిచ్ఛిత్తి..
అమ్మ గర్భాలయంలో
నవమాసాలు
తాను అవమానాలు
మోయడమే గాక
తనకు చోటిచ్చి..
చాటిచ్చి..
తన ఉనికిని చాటించే
అమ్మకు కూడా
ఈసడింపుల
ఇక్కట్లు తెచ్చే..

ఉసురు పోసుకున్న
ఉత్తరక్షణం మొదలు
ఊపిరి ఆగేదాకా
ఉసూరుమనే దశ నుంచి
చాలా దూరం వచ్చేసింది ఆడకూతురు..
తనిప్పుడు
చేదుమాత్ర కాదు
విజయయాత్ర!

ఇప్పుడు ఆడపిల్ల పుడితే
ఇంటికి పండగ..
పుత్రోత్సాహాన్ని మించి
పుత్రికోత్సాహం..
తన చదువు బరువు కాదు
ఇంటి పరువు..
తన గెలుపు
సమాజానికే మలుపు..!

గిరిని విడిచి బరిలో..
యుద్ధమైనా సిద్ధమే..
గనిలో.. వనిలో.. కార్ఖానాలో..
గుడిలో బడిలో..
బస్సులో విమానంలో..
తానే సారథి..
ఇంట వారధి..
జీవితమనే కురుక్షేత్రంలో
గెలుపోటముల
నిగ్గుతేల్చే మహారథి..
నీ ఇంట ఎప్పటికీ
తరిగిపోని నిధి..
కంటికి రెప్పలా
కాచుకోవడం
నీ విధి..!

(అయితే..
ఒక చిన్న విన్నపం..
నీకు లభిస్తున్న స్వేచ్ఛ
కారాదు దుర్వినియోగం..
నీ గౌరవం ఎప్పటికీ
ఉండాలి అలాగే..
నువ్వు ఉన్నతంగా
ఉండాలి
చిరకాలం ఇలాగే..)

**బాలికా దినోత్సవ అభినందనలతో..**

**సురేష్ కుమార్**
**9948546286**
**7995666286**

WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com

## జపాన్‌లోనూ మన యూపీఐ సేవలు... భారత పర్యాటకులకు శుభవార్త!

భారతదేశపు విజయవంతమైన డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) తన సేవలను మరో దేశానికి విస్తరించనుంది. నిక్కీ ఆసియా నివేదిక ప్రకారం, త్వరలో జపాన్‌లో కూడా యూపీఐ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం జపాన్‌కు చెందిన ప్రముఖ ఐటీ సంస్థ ఎన్‌టీటీ డేటా... నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. జపాన్‌కు వెళ్లే భారత పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో వారికి చెల్లింపులను సులభతరం చేయడమే ఈ చర్య ముఖ్య ఉద్దేశం. 2025లో సుమారు 3.15 లక్షల మంది భారతీయులు జపాన్‌ను సందర్శించారు. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 35 శాతం అధికం. ఈ క్రమంలో, 2026 ఆర్థిక సంవత్సరంలో జపాన్‌లో యూపీఐ ట్రయల్స్ నిర్వహించాలని ఎన్‌టీటీ డేటా, ఎన్‌పీసీఐ ప్రణాళికలు రచిస్తున్నాయి. ఈ వ్యవస్థ అమల్లోకి వస్తే, భారత పర్యాటకులు జపాన్‌లోని దుకాణాల్లో తమ యూపీఐ యాప్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నేరుగా చెల్లింపులు చేయవచ్చు. ఈ మొత్తం వారి భారత బ్యాంకు ఖాతాల నుంచి డెబిట్ అవుతుంది. భారత్, జపాన్ పేమెంట్ నెట్‌వర్క్‌లను అనుసంధానించే ప్రక్రియపై ఇరు సంస్థలు పనిచేస్తున్నాయి. 2016లో ప్రారంభమైన యూపీఐ, భారత్‌లో అత్యంత ప్రజాదరణ పొందింది. ఇప్పటికే భూటాన్, సింగపూర్, ఫ్రాన్స్, యూఏఈ సహా 8 దేశాల్లో యూపీఐ సేవలను ప్రవేశపెట్టారు. ప్రపంచంలోనే అతిపెద్ద రియల్ టైమ్ పేమెంట్ సిస్టమ్‌గా అంతర్జాతీయ

# నేడు కొత్తమాజేరులో ఆత్మీయ సమ్మేళనం

ఈ నెల 25వ తేదీ,ఆదివారం చల్లపల్లిమండలం కొత్తమాజేరు గ్రామంలో పూర్వ విద్యార్థులు,పూర్వ నివాసితులు ఆత్మీయ సమ్మేళనం పేరుతో సమావేశం కానున్నారు. 1950 వ సంవత్సరం నుంచి గ్రామాభివృద్ధికి పాటుబడిన మహనీయులను స్మరించుకుంటూ భవిష్యత్ బాటలు వేయడానికి ఈ ఆత్మీయ సమ్మేళనంలో సహాయ సహకారాలు అందించే నిర్ణయాలు తీసుకోవాలని భావిస్తున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనం ఉదయం 9 గంటల నుంచి చిన్న వంతెన వద్ద ఆరెకపూడి శంకరరావు దొడ్డి వద్ద సాయంత్రం వరకూ జరగనుంది. చిన్ననాటి స్నేహితుల ఆత్మీయ పలకరింపులతో సమావేశం ప్రారంభంకానుంది.అల్పాహారవిందు అనంతరం పరిచయవేదిక, ఊరి పెద్దలతో సుహృద్భావ సమావేశం, ఆత్మీయ విందు, అనంతరం పిచ్చాపాటి, గ్రామ దర్శన తేనీటీ విందు, మిత్రుల అభిప్రాయ సేకరణతో ముగుస్తుంది. తప్పక మాజేరు గ్రామ పూర్వ విద్యార్థులు, నివాసితులు హాజరై ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆహ్వాన సంఘం కోరుతున్నది.

Navataram Telugu Daily Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747,
Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State
Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com